సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



అణుశక్తిలో సుస్థిర స్థానం
మణుగూరు భారజల కర్మాగారం అణుశక్తి విభాగంలో సుస్థిర స్థానం సంపాదించుకుందని కర్మాగారం జీఎం ఎస్.జగ్గారావు తెలిపారు. 8లో



..భూముల స్వాధీనానికి యత్నం
ఇల్లెందు మండలం రాజీవ్‌నగర్‌తండాలో కొన్ని సర్వే నరిత కుటుంబకుల ఆధీనంలోని భూముల స్వాధీనానికి అధికారులు యత్నించారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
37° / 20°

వాతావరణం
జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రత అధికం గా ఉంటుంది. తెల్లవారుజామున, రాత్రి వేళ ల్లో మాత్రం వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక మంగళ వారం నేత్ర పర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ బేడా మండపానికి తీసుకొచ్చి కొలువు దీర్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యా వాచనం నిర్వహించిన తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపిం చారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించు కుని అభయాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో రేపు రుద్రహోమం

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీ రిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో గురువారం రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.ర జనీకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యా హ్నం 1 వరకు యాగశాలలో హోమం ఉంటుం దని, పాల్గొనదలచిన భక్తులు రూ.1,516 చెల్లిం చి గోత నామాలు నమోదు చేసుకోవాలని కోరారు. పూజలో పాల్గొనే పురుషులు ధోతి, కుండువా, మహిళలు చీరలు ధరించాలని, వివ రాలకు 9866923261, 6303408458 నంబర్ల లో సంప్రదించాలని సూచించారు.

ఈనెల 21లోగా పరీక్ష ఫీజు చెల్లించండి

కొత్తగూడెంఅర్బన్: ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన ఏప్రిల్, మే నెలల్లో జరగనున్న పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలు రాయ నున్న విద్యార్థులు ఈనెల 12 నుంచి 21వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ ఎం .వెంకటేశ్వరచారి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు సూచిం చారు. పదో తరగతి విద్యార్థులు థియరీ, ప్రాక్టి కల్ సబ్జెక్టులకు రూ.100 చొప్పున, ఇంటర్ విద్యార్థులు రూ.150 చొప్పున చెల్లించాల్సి ఉం టుందని తెలిపారు. కాగా, సబ్జెక్టుకు రూ.25 చొప్పున అపరాధ రుసుముతో ఈనెల 27 వరకు, రూ.50 అపరాధ రుసుముతో మార్చి 4 వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉందని డీఈఓ, కోఆర్డినేటర్ వెల్లడించారు. కాగా, ఫీజు వెబ్‌సైట్, మీ సేవ లేదా ఆన్‌లైన్‌లో చెల్లిం చొచ్చని, చలానా, డీడీ రూపంలో చెల్లిస్తే అను మతించబోమని తెలిపారు.

అలరించిన జానపద పాటలు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో భద్రా ద్రి కళా భారతి ఆధ్వర్యంలో జరుగుతున్న అం తర్రాష్ట్ర నాటకోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజున జానపద పాటలు, నాట్య ప్రదర్శనలు, చిన్నారుల నృత్యాలు పలువురి ఆలరించాయి. శ్రీ అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ గుంటూరు వారిచే నిర్వహిం చిన 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక ఆకట్టుకుంది. చివరి రోజు సందర్భంగా అతిథులను ఘనం గా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకు లు పాకాల దుర్గాప్రసాద్, అల్లం నాగేశ్వర రావు, నరసింహారావు, రామరాజు, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడింగ్ సిబ్బందికి వివరాలు ఇవ్వండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): గృహజ్యోతి పథ కాన్ని అమలు చేయడానికి విధి విధానాలను విద్యుత్ ఎస్ఈ రమేష్ మంగళవారం ఒక ప్రక టనలో తెలిపారు. వినియోగదారులకు 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వడానికి మీటర్ రీడిం గ్ తీయడానికి వచ్చిన స్పాట్ బిల్లర్‌కు రేషన్, ఆధార్ కార్డు నంబర్లు, సెల్ నంబరు చూపిం చాలని సూచించారు. సొంత ఇల్లు లేకుండా అద్దె ఇంట్లో ఉండే వారు కూడా అర్హులేనని, వారి ఆధార్, రేషన్, మొబైల్ నంబర్లను ఇంటి సర్వీస్ నంబర్‌కు లింక్ చేయాలని సూచిం చారు. తద్వారా ఇంటి ఓనర్‌షిప్ మారదని అన్నారు. ఒకవేళ ఇంటివద్ద లేకుంటే పై నం బర్లు పేపర్‌పై రాసి మీటర్ వద్ద పెట్టాలని సూచించారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

టేకులపల్లి: గర్భిణులకు వైద్యం అందించడం లో నిర్లక్ష్యం చేయొద్దని డీఎంహెచ్ఓ శిరీష సూచించారు. మంగళవారం ఆమె సులానగర్ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గర్భిణులకు అన్ని రకాల పరీక్ష లు నిర్వహించాలని, సురక్షితమైన ప్రసవం జరిగేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమం లో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుకృత, వైద్యాధికారి కందుల దినేష్, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి మధువరుణ్,, గన్యా నాయక్, హరికృష్ణ, భద్రు, శకుంతల, విజయ, నాగుబం డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జాతరతో జర జాగ్రత్త!



మహాలక్ష్మి అమలు తర్వాత కొత్తగూడెంలో బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న మహిళలు



మేడారానికి ఉమ్మడి జిల్లా నుంచి 429 బస్సులు

- మహాలక్ష్మితో ఆర్టీసీకి పెరిగిన రద్దీ
- ప్రధాన స్టేషన్లలో బస్ పాయింట్లు
- రద్దీకి తగ్గట్టు ఏర్పాట్లు చేయాలంటున్న భక్తులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రతీ రెండేళ్లకు ఒకసారి జరిగే మేడారం మహా జాతరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వెళ్తారు. ముఖ్యంగా భద్రాద్రి జిల్లా నుంచి లక్షల మంది భక్తులు సమ్మక్క – సారలమ్మలను దర్శించు కునేందుకు మేడారం వెళ్తుంటారు. దీంతో జాతర ప్రయాణ ఏర్పాట్లకు ఆర్టీసీ సన్నద్ధం అవుతోంది. అయితే గతంతో పోల్చితే మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి రావడంతో ఆర్టీసీ మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఏర్ప డుతోంది.

ఇప్పటికే పెరిగిన రద్దీ..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత అన్ని డిపో బస్సులు కాస్త అటు ఇటు గా నూరు శాతం ఆక్యుపెన్సీతో తిరుగుతున్నాయి. ముఖ్యంగా ప్రధాన బస్ స్టేషన్లుగా ఉన్న ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలంలో అయితే తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ ప్రయాణికుల రద్దీ ఉంటోంది. బస్సుల్లో సీటు దక్కించుకునేందుకు మహిళలు పోటీ పడుతు న్నారు. బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు దిగే స్థలం దగ్గరే సీటు కోసం ప్రయత్నించేవారు ఎక్కువ య్యారు. నిర్ణీత ప్లాట్‌ఫామ్‌పైకి బస్సు చేరుకోక ముందే, ఎదురెళ్లి ఎక్కేందుకు, కిటికీల నుంచి దస్తీ లు విసిరేందుకు పోటీ పడుతున్న ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. సాధారణ రోజుల్లోనే బస్సులో సీటు కోసం పోటీ ఇలా ఉంటే ఇక జాతర సమయంలో మరింతగా పెరుగుతుంది.

429 సర్వీసుల ఏర్పాటు..

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి మేడారం జాతరకు ఈసారి 429 బస్సులు నడిపించాలని ఆర్టీసీ ప్రాథ మికంగా నిర్ణయించింది. ఇందులో అత్యధికంగా కొత్తగూడెం నుంచి 130 బస్సులు, ఇల్లెందు నుంచి 124, భద్రాచలం – 50, పాల్వంచ – 45, ఖమ్మం – 30, మణుగూరు – 25, టేకులపల్లి నుంచి 25 బస్సులు ఉన్నాయి. ఈ బస్సులు నడిపేందుకు వీలుగా ప్రతీ స్టేషన్‌లో ప్రత్యేకంగా పాయింట్లు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. పాయింట్ల వద్ద భక్తులకు నీడ కోసం టెంట్లు /పం దిర్లతో పాటు టికెట్ కౌంటర్, తాగునీటి సౌకర్యాన్ని ఆర్టీసీ ఏర్పాటు చేస్తోంది. అయితే 'మహాలక్ష్మి'తో పెరిగిన రద్దీని దృష్టిలో పెట్టుకుని వరంగల్, మేడా రంలో ఏర్పాటు చేసినట్టుగా తోపులాట చోటు చేసు కోకుండా బారికేడ్లతో క్యూలైన్లు ఏర్పాటు చేయా లని భక్తులు కోరుతున్నారు.

పురుషులకు ప్రత్యేక సీట్లు కేటాయించాలి..

ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో 80 శాతం సీట్లు మహిళల తోనే నిండిపోతున్నాయి. పురుషులకు సీట్లు దొర కడం లేదు. ఇక మేడారం జాతరకు పిల్లా పాపలతో కనీసం ఒక రోజు బస చేసేలా కుటుంబ సమేతంగా భక్తులు వెళ్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సీట్ల కేటాయింపు విషయంలో మగవారికి ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఆ నాలుగు రోజులే కీలకం..

సమ్మక్క – సారలమ్మ జాతర ఈనెల 21 (బుధవారం) నుంచి 24 (శనివారం) వరకు జరగనుంది. బుధవారం సారలమ్మ గద్దెల పైకి చేరుకోగా, గురువారం సమ్మక్క తల్లి చిల కలగుట్ట నుంచి గద్దెలపైకి వస్తుంది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా జాతరకు వచ్చే భక్తులు మం గళవారం సాయంత్రం నుంచి గురువారం మధ్యాహ్నం వరకు మేడారం వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తారు. దీంతో ఆర్టీసీ బస్సులపై ఒక్కసారిగా ఒత్తిడి పడుతుంది. వందల సం ఖ్యలో బస్సులు ఏర్పాటు చేసినా భక్తులంతా ఒకేసారి రావడం, బస్సు ఎక్కేందుకు పోటీ పడడం ప్రతీ ఏడాది జరిగే తంతే. ఇంకా ఈసారి మహాలక్ష్మి రద్దీ కూడా తోడవుతుంది. పిల్లాపాపలు, భారీ లగేజీతో బస్ పాయిం ట్లకు వచ్చే వారు సీట్ల కోసం పోటీ పడితే పరిస్థితి అదుపుతప్పే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో బస్ పాయింట్లలో అదనపు జాగ్ర త్తలు అవసరమని భక్తులు అంటున్నారు.

స్వచ్ఛతపై నజర్..



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల

- నేటి నుంచి పారిశుద్ధ్య కార్యక్రమాలు
- ఉత్తమంగా నిలిచే పల్లెలకు ప్రశంసలు

చుంచుపల్లి: గ్రామ పంచాయతీల్లో ఈనెల 2 నుంచి ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి రాగా, జిల్లా వ్యాప్తంగా 218 మంది గెజిటెడ్ అధికారులను స్పెష లాఫీసర్లుగా నియమించారు. వారి పాలనలో గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కొత్త ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఈ మేరకు బుధవారం నుంచి ఈనెల 15 వరకు జిల్లా లోని 481 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. పం చాయతీల పరిధిలోని యువకులు, స్వశక్తి సంఘాల మహిళలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చింది. ఉత్తమం గా ఎన్నికైన పంచాయతీలకు ఉన్నతాధికారులు ప్రశంసపత్రాలు అందిస్తారు. జిల్లాలో పారిశుద్ధ్య కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేం దుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణపై స్పెష లాఫీసర్లు, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. తొలి రోజు ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామ సభలు ఏర్పాటు చేసి గ్రామస్తుల సమక్షంలో సమ స్యలపై చర్చిస్తారు. వాటికి ఈ వారం రోజుల్లో చేపట్టే కార్యక్రమాల ద్వారా కొంత పరిష్కారం చూపుతారు.

చేపట్టే పనులిలా..

ఫిబ్రవరి 7న గ్రామసభ నిర్వహించాలి. మహిళా, యువజన సంఘాలను, గ్రామ పెద్దలను, ప్రజాప్ర తినిధులను ఆహ్వానించాలి. గ్రామంలోని సమస్య లను సభ ద్వారా గుర్తించి శానిటేషన్, తాగునీటి సరఫరా, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలి. 8న యువత, మహిళలు, అధికారులతో కలిసి గ్రామంలో శ్రమదానం నిర్వ హించాలి. తడి–పొడి చెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. 9న వైకుంఠధా మాలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు, ఇతర కమ్యూనిటీ ప్రాంతాలలో ఉన్న కలుపు మొక్కలను, పొదలను ఉపాధి హామీ కూలీలు, గ్రామపంచాయతీ సిబ్బంది ద్వారా తొలగించాలి. హరితహారంలో నాటిన మొక్కలకు నీరు పోయాలి. 10న రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను, గడ్డిని, ముళ్ల పొదలను, తొలగించాలి. గ్రామంలో అంగన్ వాడీలు, గ్రామపంచాయతీ భవనాలు, వాటర్ ట్యాంకులు, ప్రభుత్వ ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ భవనాల వద్ద నున్న ఖాళీ ప్లాట్లలో చెత్త, పిచ్చి మొక్కలు తొలగించాలి. 11న పంచాయ తీలోని ప్రతి మంచినీటి ట్యాంకులను శుభ్రపర చాలి. మంచినీటి పైపు లైన్ లికేజీలు గుర్తించి మర మ్మతు చేయాలి. 12న మురికి కాల్వలను శుభ్రపర చాలి. గ్రామంలో తరచుగా చెత్త వేసే ప్రాంతాలను గుర్తించి శుభ్రపరచాలి. గ్రామంలో ప్రతి వీధి తిరు గుతూ ప్రజలు చెత్త వేయకుండా అవగాహన కల్పిం చాలి. 13న పాఠశాల పిల్లలకు, దేవాలయాల దగ్గర గల షాపులు, హోటళ్లో వారికి ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే జరిమానాలు వేయడం జరు గుతుందని హెచ్చరించాలి. పర్యావరణ అనుకూల వస్త్ర సంచులను వాడుటకు షాపుల వారిని ప్రోత్స హించాలి. 14న యువత పారిశుద్ధ్య కార్యక్రమాలు, క్రీడా పోటీలల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి. మద్య పానం, ధూమపానం, గుట్కా, తంబాకు, గం జాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థా లను వివరించాలి. 15న ప్లాస్టిక్ రహిత గ్రామ పం చాయతి కోసం ర్యాలీ నిర్వహించాలి. పంచాయతీ స్థాయిలో పారిశుద్ధ్య వారోత్సవాలలో బాగా పనిచే సిన పంచాయతీ సిబ్బంది, యువజన సంఘానికి, మహిళా సంఘానికి, పంచాయతీ కార్యదర్శికి సన్మానం చేసే వారిని గౌరవించాలి.

పల్లెల అభివృద్ధికి కృషి చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): పల్లెల అభివృద్ధికి ప్రత్యేక అధికారులు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యం లో ప్రత్యేకాధికారుల విధులపై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ పాలకవ ర్గాల గడువు ఈనెల 1వ తేదీతో ముగిసిందని, దీంతో గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారు లను నియమించామని తెలిపారు. జిల్లాలోని 479 పంచాయతీలకు 218 మంది ప్రత్యేకాధి కారులను నియమించినట్లు తెలిపారు. సర్పం చ్‌ల వలె అన్ని విధులు ప్రత్యేక అధికారులకు ఉంటాయని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత మేరకు ప్రత్యేక అధికారులు విధులు నిర్వహిం చాలని సూచించారు. గ్రామాలలో జరుగు తున్న పనులను పర్యవేక్షిస్తూ పనులలో నాణ్య తా ప్రమాణాలు తనిఖీ చేయాలన్నారు. ఉపా ధిహామీ పనులను తనిఖీ చేయాలని అన్నారు. తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని సూచిం చారు. ఈనెల 7 నుంచి 15 వరకు నిర్వహించ నున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను పక డ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్య క్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి మధుసూదన్‌రాజు, డీపీఓ రమాకాంత్, డిప్యూ టీ సీఈఓ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో పోలీసులు ముందుండాలి

ఎస్పీ రోహిత్ రాజ్




భరోసా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

కొత్తగూడెంరూరల్: ప్రజలకు సేవ చేయడంలో పోలీసులు ముందుండాలని ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రా పురం పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో 15 రోజుల పాటు సాగిన జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది మొబిలైజేషన్ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సంద ర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పని చేసే ప్రతీ ఒక్కరు క్రమశిక్షణ కలిగి ఉండాలని, బాధ్యతాయుతంగా ప్రజలకు సేవ చేసేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మొబిలైజేషన్ కార్యక్రమం ద్వారా శారీరక దృఢ త్వంతోపాటు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు, సీఐ నాగరాజు, అడ్మిన్ ఆర్ఐ రవి, హోంగార్డ్స్ ఆర్ఐ నర్సింహారావు, వెల్ఫేర్ ఆర్ఐ కృ ష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది భరోసా కేంద్రాలు ప్రారంభం

కొత్తగూడెంటౌన్: మహిళలు, చిన్నారుల రక్షణ కోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో మంగ ళవారం ఎనిమిది భరోసా కేంద్రాలను డీజీపీ రవి గుప్తా వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమం లో పాల్గొన్న జిల్లా ఎస్పీ బి.రోహిత్‌రాజ్ మాట్లా డుతూ.. లైంగిక దాడికి గురైన బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటి నుంచి కేసు ట్రయల్‌కు వచ్చి, పరిహారం ఇప్పించే వరకు భరోసా కేంద్రం అండగా నిలుస్తుందని అన్నారు. అత్యాచార కేసు లు, పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కేసుల్లోని బాధిత మహిళలను అక్కున చేర్చుకుని వైద్యం, న్యాయ, సైకాలజిస్టు, న్యాయాధికారి, పోలీసుల సహాయం వంటి సేవలు అందిస్తుందని వివరిం చారు. భరోసా కేంద్రాల్లోని బాధితులకు వివిధ రంగాల్లో నైపుణ్యత నేర్పించి వారిని సమాజంలో ఉన్నతంగా జీవించేలా దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహ మాన్, షీటీం ఇన్‌చార్జ్ ఎస్సై పి.రమాదేవి, ఏహెచ్ టీయూ ఎస్సై శ్రీనివాస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగ రాజు, రాజువర్మ, టూటౌన్ సీఐ రమేష్‌కుమార్, ఎస్సైలు నరేష్, సంతోష్, రవి, పురుషోత్తం, జుబే దా, విజయ, విజయకుమారి పాల్గొన్నారు.

రోడ్డెక్కిన పత్తి రైతులు



ఆందోళన చేస్తున్న పత్తి రైతులు

బూర్గంపాడు: పత్తి కొనుగోళ్లకు సీసీఐ అధికారులు నిరాకరిస్తున్నారంటూ మండలంలోని లక్ష్మీపురం ప్రధాన రహదారిపై పత్తి ట్రాక్టర్లతో రైతులు మంగ ళవారం ఆందోళన చేపట్టారు. దీంతో ట్రాఫిక్‌కు అం తరాయం కలిగింది. ఆందోళన విషయం తెలుసు కున్న మార్కెట్ కమిటీ ప్రత్యేక కార్యదర్శి నిర్మల, సీసీఐ బయ్యర్ సంజీవరావు, ఎస్సై రాజ్‌కుమార్ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా ఆందోళనను విరమింపజే శారు. అనంతరం రైతులతో చర్చలు జరిపారు. పత్తి నాణ్యత లేకపోవడంతోనే కొనుగోలుకు నిరాకరిస్తు న్నామని సీసీఐ బయ్యర్లు తెలిపారు. తమ ఇబ్బం దులను దృష్టిలో ఉంచుకుని కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరారు. రైతులు, సీసీఐ అధికారుల మధ్య సమన్వయం చేసి పత్తి కొనుగోలు చేసేలా నిర్మల చర్యలు తీసుకున్నారు. అనంతరం సీసీఐ బయ్యర్లు పత్తి కొనుగోలు చేశారు.

ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలి

సీనియర్ ఐఏఎస్ అధికారి బాల మాయాదేవి



మాట్లాడుతున్న బాల మాయాదేవి

సూపర్‌బజార్(కొత్తగూడెం)/సుజాతనగర్: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కుకు ఎంతో ప్రాధా న్యత ఉందని, పారదర్శకంగా ఓటరు జాబితా తయారు చేయాలని సీనియర్ ఐఏఎస్ అధికారి బాల మాయాదేవి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం నిర్వహించిన సమావేశం లో ఆమె మాట్లాడారు. ప్రత్యేక ఓటరు సవరణలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించినట్లు తెలిపారు. అర్హులైన యువత ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల తుది జాబితా గురువారం విడుదల చేయనున్నందున ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా చూడాలని అధికారు లను ఆదేశించారు. జాబితా రూపకల్పనపై నియో జకవర్గ వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి బుధవారం సమావేశం నిర్వహించాలన్నారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ పి. రాంబాబు, కొత్తగూడెం ఆర్డీఓ శిరీష, ప్రత్యేక ఉపకలెక్టర్ కాశయ్య, ఎన్నికల విభాగం తహసీల్దార్ దారా ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం సుజాతనగర్‌లోని బీసీ గురుకుల పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. వసతులు, తరగతి గదులు, వం టశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్య క్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఇందిర, ప్రిన్సిపాల్ వి.బ్యూలారాణి పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి

ఇన్‌చార్జ్ డీవైఎస్ఓ సీతారాం



పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ డీవైఎస్ఓ సీతారాం

కొత్తగూడెంటౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు ప్రోత్సహించాలని జిల్లా ఇన్‌చార్జ్ డీవైఎస్ఓ టి.సీతారాం అన్నారు. కొత్తగూడెం త్రీ ఇంక్‌లైన్ పరిధిలోని తెలంగాణ క్రీడా మైదానంలో అండర్ –15, అండర్– 20 విభాగాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలను చిన్నప్పటి నుంచే చదువుతో పాటు క్రీడ ల్లోనూ ప్రోత్సహిస్తే వారికి మంచి భవిష్యత్ అందిం చినట్టవుతుందన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కన బరిచి రాష్ట్రస్థాయిలో కూడా రాణించాలని ఆకాం క్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా స్పోర్ట్స్ ఆథారిటీ ఎప్పుడూ ముందుంటుం దని అన్నారు. క్రీడల నిర్వాహకులు పి.కాశీహు స్సేన్ మాట్లాడుతూ.. పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 200 మంది క్రీడాకారులు హాజర య్యారని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను బుధ, గురువారాల్లో (నేడు, రేపు) హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. అనంతరం క్రీడల ముగింపు కార్యక్రమానికి రెజ్లింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు హాజరై విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ రెజ్లింగ్ క్రీడాకారిణి పి.నీహారిక, క్రీడా సంఘాల ప్రతినిధులు కె.కృష్ణారావు, కె.మహిధర్, ఆదినారాయణ, ఇ.మొగిలి, కె.శ్రీనివాస్, జి.కృష్ణ, కె.పద్మ, ఎంపీటీసీ బోడ శారద, మాజీ సర్పంచ్ మోతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది ఎదురుకావొద్దు

- పీఆర్, మిషన్ భగీరథ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్
- నాలుగు జిల్లాల అధికారులతో సమీక్ష



జీళ్లచెరువులో నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న సందీప్‌కుమార్ సుల్తానియా, అధికారులు



సమీక్షలో మాట్లాడుతున్న సుల్తానియా, పక్కన ఖమ్మం కలెక్టర్, ఈఎన్‌సీ

కూసుమంచి: రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బంది ఎదురుకాకుండా అధికారులు తగిన చర్య లు తీసుకోవాలని పంచాయతీరాజ్, మిషన్ భగీరథ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా సూచించారు. ఖమ్మం జిల్లా పాలేరులోని మిషన్ భగీరథ ప్రాజెక్టు, ప్రాజెక్టుకు నీరందించే రిజర్వా యర్, గురువాయిగూడెం వద్ద తాగునీటి ప్రాజెక్టు, జీళ్లచెరువులోని మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ఇంజనీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డి రెడ్డితో కలిసి ఖమ్మం, భద్రాది కొత్తగూడెం, సూర్యాపేట, మహ బూబాబాద్ జిల్లాల అధికారులతో సమావేశమ య్యారు. జిల్లాల వారీగా జనాభా, తాగునీటి సర ఫరా, రోజువారీ డిమాండ్, నల్లా కనెక్షన్ వివరాలు తెలుసుకున్నాక సుల్తానియా మాట్లాడారు. వేసవి సమీపించినందున రాబోయే మూడు నెలలు కీలక మని, ఈ సమయంలో అధికారులు నీటి ఎద్దడి రాకుండా చూడాలని సూచించారు. ఏమైనా ఇబ్బం దులు ఉంటే ఇప్పుడే సరిచేసుకోవాలన్నారు. జల జీవన్ నిధులు రానున్నందున గ్రామాల్లో పనులు పూర్తిచేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గానికి కేటాయిస్తున్న రూ.10కోట్లలో పది శాతం నిధులు తాగునీటి అవసరాలకు ఉప యోగించవచ్చునని వెల్లడించారు. కాగా, తాగునీటి సరఫరా పర్యవేక్షణ కోసం మండలానికో ఇంజనీ ర్‌ను కేటాయించాలని, సమస్యాత్మక మండలాల్లో అవసరమైతే ఇద్దరిని నియమించాలని ఆదేశిం చారు. మిషన్ భగీరథ ప్రాజెక్టులకు జలాశయాల ద్వారా ఇబ్బంది లేకుండా నీరందేలా ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేస్తున్నామని, తక్కువ నీరు ఉన్న జలాశయాల నీటిని తాగు అవసరాలకే వినియోగించాలన్నది ప్రభుత్వ పాలసీ అని తెలిపారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ మిషన్ భగీరథ ఏఈలు స్థానికంగా నివాసముంటూ మిషన్ భగీరథ నీటి సరఫరా లేని గ్రామాల్లో అందు బాటులో ఉన్న వనరులను ఉపయోగించి తాగునీటి సమస్య తీర్చాలని సూచించారు. కాగా, పాలేరుకు గతంలో గోదావరి జలాలు చేరాయని, ఇప్పుడూ విడుదల చేస్తే ఇబ్బందులు తొలగుతాయని పలువురు సుల్తానియా దృష్టికి తీసుకురాగా ఆ దిశ గా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సత్యప్ర సాద్, డీపీఓ హరికిషన్, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ విద్యాచందన, మిషన్ భగీరథ సీఈలు శ్రీనివాస్, చెన్నారెడ్డి, లలిత, ఎస్ఈలు సదాశివకు మార్, రాములు, ఈఈలు వాణిశ్రీ, పుష్పలత, నరేందర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, వంశీ, అరుణ్‌కు మార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి తుమ్మలను కలిసిన అధికారులు


మంత్రిని సత్కరిస్తున్న అధికారులు

దమ్మపేట: రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఖమ్మం జిల్లా ఉద్యాన శాఖ అధికారిని అనసూయ మంగళవారం కలిశారు. దమ్మపేట మండలం గండుగులపల్లిలోని నివాసంలో మంత్రి తుమ్మలను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈకార్యక్రమంలో అశ్వారావుపేట పామాయిల్ డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న ట్రెయినీ ఐపీఎస్‌లు


భద్రాచలంలో ట్రెయినీ ఐపీఎస్‌లను సత్కరిస్తున్న అధికారులు

భద్రాచలం/దుమ్ముగూడెం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారిని ట్రెయినీ ఐపీఎస్‌లు శివకుమార్ ఉపాధ్యాయ, అంకిత్ శంఖ్వార్, శేషాద్రినిరెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వాగతం పలకగా.. రామయ్య దర్శనానంతరం అనుబంధ ఆలయాల్లోనూ పూజలు చేశారు. ఆతర్వాత దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాలలో కూడా శ్రీసీతారామచంద్ర స్వామి వారిని ట్రెయినీ ఐపీఎస్‌లు దర్శించుకున్నారు. సీఐ బి.అశోక్, ఎస్‌ఐ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం, ఆరోగ్యం


బ్యాటింగ్ చేసి టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

టేకులపల్లి: క్రీడలతోనే మానసిక ఉల్లాసం, ఆరోగ్యం లభిస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. టేకులపల్లిలో ఏర్పాటుచేసిన కనకన్న ప్రీమియర్ లీగ్(కేపీఎల్, మూడు నవీన్ మెమోరియల్) సీజన్–1 క్రికెట్ టోర్నీని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి టోర్నీలతో గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్, ఎంపీటీసీలు రామకృష్ణ, పూనెం సురేందర్, ఎస్‌ఐ రమణారెడ్డితోపాటు బోడ మంగీలాల్, మూడు గణేష్, కత్తుల అఖిల్, దొండ రమేష్, ఉల్లోజు ఉదయ్, నర్సింగ్ లక్ష్మయ్య, చంద్రకళ, రెడ్యా నాయక్, మధురెడ్డి, సంజయ్, భద్రు, వెంకన్న, ప్రశాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో పంట వివరాలు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలలోని వ్యవసాయ క్షేత్రాలు, ఆయా పంటల వివరాలు తెలుసుకునేలా సాంకేతికతను అందుబాటులో ఉంచారు. కళాశాలలోని వ్యవసాయ క్షేత్రాల్లో సాగు చేస్తున్న పామాయిల్, అరటి, మామిడి, వివిధ రకాల అంతర్ పంటల వివరాలను సాంకేతిక సాయంతో డిజిటల్ విధానంలో పొందుపరిచారు. ఆయా పంటల వద్ద క్యూఆర్ కోడ్‌ల బోర్డులను ఏర్పాటు చేయగా, తాజాగా కళాశాలలో జరుగుతున్న అంతర కళాశాల క్రీడా పోటీలకు విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్, సిరిసిల్ల, జగిత్యాల, తోర్నాల, సంగారెడ్డి, వరంగల్, సిద్దిపేట, రుద్రూరు, ఆదిలాబాద్ వ్యవసాయ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులంతా వీటిని ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. ఆయా విద్యార్థులు పంట క్షేత్రాలను సందర్శించి తమ వద్ద ఉన్న మొబైల్ ఫోన్లలో క్యూర్ కోడ్‌లను స్కాన్ చేసి పంటల వివరాలను తెలుసుకుంటున్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, ప్రొఫెసర్లు గోపాలకృష్ణ మూర్తి, శ్రావణ్ కుమార్, కృష్ణతేజ, మధుసూదన్‌రావు, శిరీష, పావని, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఎంబీబీఎస్ విద్యార్థుల శిక్షణ

టేకులపల్లి: కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కాలేజీ రెండో సంవత్సరం విద్యార్థులు మంగళవారం మండలంలోని సులానగర్ పీహెచ్‌సీని సందర్శించారు. కమ్యూనిటీ మెడిసిన్ క్లినికల్ పోస్టింగ్‌లో భాగంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మోకాళ్ల వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై.వనితతో కలిసి వచ్చిన వారు చికిత్స, మందుల వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు కందుల దినేష్, రోహిత్, గోపాల్‌తో పాటు భద్రమ్మ, అమ్మణి లక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,595

అణుశక్తి విభాగంలోనే సుస్థిర స్థానం

- మణుగూరు భారజల కర్మాగారం జీఎం జగ్గారావు
- 38వ డీఏఈ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ ప్రారంభం


క్రీడాపతాకాన్ని ఆవిష్కరిస్తున్న జీఎం


మాట్లాడుతున్న కన్వీనర్ హెచ్.కే.శర్మ

అశ్వాపురం: భారజలం ఉత్పత్తి, ఎగుమతులు తదితర కార్యక్రమాలతో మణుగూరు భారజల కర్మాగారం దినదినాభివృద్ధి చెందుతూ భారత అణుశక్తి విభాగంలో సుస్థిర స్థానం సంపాదించుకుందని కర్మాగారం జీఎం ఎస్.జగ్గారావు తెలిపారు. మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో 38వ భారత అణుశక్తి విభాగం(డీఏఈ) స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌లో భాగంగా సాంస్కృతిక పోటీలను మంగళవారం జీఎం జెండా ఎగురవేసి ప్రారంభించాక మాట్లాడారు. అణుశక్తి విభాగం, భారజల బోర్డు చేపట్టే అన్ని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ మణుగూరు కర్మాగారానికి గుర్తింపు తీసుకొచ్చామన్నారు. తొలుత అనంతరం డీఏఈ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ కన్వీనర్ హెచ్.కే.శర్మ ప్రారంభోపన్యాసం చేస్తూ పోటీలకు దేశంలోని ఎనిమిది కర్మాగాల నుంచి కళాకారులు హాజరయ్యారని తెలిపారు. సీఏఓ జీ.వేణు, అధికారులు, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా అంతర కళాశాల క్రీడాపోటీలు

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని అంతర కళాశాల క్రీడా పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో ఈ పోటీలు నిర్వహిస్తుండగా రాష్ట్రంలోని 11 కళాశాలల పరిధిలోని 430 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. రెండో రోజైన మంగళవారం నిర్వహించిన టెన్నికాయిట్ పోటీల బాలికలు, బాలుర విభాగాల్లో అశ్వారావుపేట విజయం సాధించంగా, బాలుర డిస్క్‌త్రో, జావెలిన్ త్రో, 200 మీటర్ల పరుగు పందెం పోటీల్లో అశ్వారావుపేట జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే, ఫుట్‌బాల్, వాలీబాల్, క్యారమ్స్ తదితర క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నాయి. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, ప్రొఫెసర్లు జి.గోపాల కృష్ణమూర్తి, శ్రావణ్‌కుమార్, మధుసూదన్‌రావు, కృష్ణతేజ, శిరీష, పావని, నీలిమ, ఉద్యోగులు పాల్గొన్నారు.


క్యారమ్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చెప్పల దండలతో సత్కరిస్తాం

- బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకోవాలి
- మాజీ ఎంపీ పోరిక బలరామ్ నాయక్


భద్రాచలంలో మాట్లాడుతున్న బలరామ్ నాయక్

భద్రాచలంటౌన్/ఇల్లెందు: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెప్పు చూపుతూ ఆరోపణలు చేసిన బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకోకపోతే యువకులు ఆయనను చెప్పుల దండలతో సత్కరిస్తారని మాజీ ఎంపీ పోరిక బలరామ్ నాయక్ హెచ్చరించారు. భద్రాచలం, ఇల్లెందులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాల్క సుమన్ ఓటమిని తట్టుకోలేక ముఖ్యమంత్రిని విమర్శిస్తూ చెప్పు చూపించాడని, విద్యార్థులు, యువత, తెలంగాణ సమాజం చేతిలో ఆయన తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఇలాంటి దిక్కుమాలిన నేతలను బీఆర్ఎస్ పెంచి పోషిస్తోందని విమర్శించారు. కుహనా సంస్కృతి కలిగిన సుమన్ లాంటి వ్యక్తుల వల్ల కేసీఆర్, కేటీఆర్ ఇమేజ్ పెరుగుతుందా అని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్ మెప్పు కోసం పాకులాడే బాల్క సుమన్ స్థాయి ఏంటో ప్రజలందరికి అర్థం అయ్యిందన్నారు. ప్రభుత్వానికి సహకరించాల్సిన ప్రతిపక్షం.. చెప్పుల సంస్కృతికి స్వస్తి చెప్పాలని హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డికి, తెలంగాణ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు ఎస్‌కె జానీ, బుడగం శ్రీనివాస్, తమ్మళ్ల వెంకటేశ్వరరావు, భోగాల శ్రీనివాస రెడ్డి, చింతిరాల రవికుమార్, శ్రీనివాసగౌడ్, పోషం వెంకటేశ్వర్లు, మెకానిక్ రమేష్ తదితరులు ఉన్నారు.

కౌన్సిలర్ భూముల స్వాధీనానికి యత్నం


ఎఫ్‌ఆర్‌ఓ నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఇల్లెందురూరల్: మండలంలోని రాజీవ్‌నగర్‌తండా వద్ద సర్వే నెంబర్ 549 పరిధిలో కౌన్సిలర్ కొండపల్లి సరిత కుటుంబీకుల ఆధీనంలో ఉన్న భూమి రిజర్వ్ ఫారెస్టు పరిధిలోకి వస్తుందంటూ స్వాధీనం చేసుకునేందుకు అధికారులు చేరుకున్నారు. మంగళవారం సాయంత్రం అటవీ, రెవెన్యూ అధికారులు చేరుకోగా.. కౌన్సిలర్ సరిత కుటుంబీకులు, బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు వచ్చి అడ్డుకున్నారు. జాయింట్ సర్వే చేయకుండా భూమి అటవీ శాఖ పరిధిలోని వస్తుందని ఎలా నిర్ధారించారని నిలదీశారు. ఈక్రమంలో ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ఎఫ్ఆర్ఓ నాగేశ్వరరావు, తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ గతంలో రెవిన్యూ, అటవీశాఖ ఆధ్వర్యాన జాయింట్ సర్వే చేయగా, ప్రస్తుతం అభ్యంతరాలు రావడంతో మరోమారు సర్వే చేసి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కాగా, ఈ ఘటనపై బీఆర్ఎస్ నాయకుడు హరిసింగ్, తదితరులు మాట్లాడుతూ మున్సిపాలిటీ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టినందుకే ప్రతీకార చర్యగా కాంగ్రెస్ నాయకులు రెవెన్యూ, అటవీశాఖ అధికారులను పురమాయించారని ఆరోపించారు.

క్షయ నివారణకు కృషి చేయాలి

డీటీసీఓ డాక్టర్ శ్రీనివాస్


మాట్లాడుతున్న డీటీసీఓ శ్రీనివాస్

జూలూరుపాడు: క్షయ వ్యాధి నివారణకు కృషి చేయాలని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి(డీటీసీఓ) డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశా డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్షయ(టీబీ) అంటు వ్యాధని, ఇది మైక్రో బ్యాక్టీరియం ట్యూబర్ క్యులోసిస్ అనే క్రిమి వల్ల వస్తుందని చెప్పారు. రెండు వారాలకు మించి ఎడతెరిపి లేకుండా దగ్గు, సాయంత్రం జ్వరం రావడం, రాత్రి పూట చెమటలు రావడం, ఆకలి తగ్గటం, ఛాతీ నొప్పి, బరువు తగ్గడం, తెమడలో రక్తం పడడం వంటి లక్షణాలు ఉంటే తక్షణమే ఆస్పత్రిలో చూపించుకోవాలని సూచించారు. అలాంటి వారికి వెంటనే తెమడ పరీక్ష చేయించాలని ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలను ఆదేశించారు. ఈ వ్యాధి వంశపారంపర్యంగా వస్తుందనేది అపోహ మాత్రమేనన్నారు. వ్యాధి సోకిన వ్యక్తి సక్రమంగా మందులు వాడితే ఆరు నెలల్లో జబ్బు తగ్గుతుందని తెలిపారు. అనంతరం నులిపురుగుల నివారణ, పల్స్ పోలియో, సుఖ ప్రసవాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్‌కుమార్, డాక్టర్ తేజస్విని, హెచ్ఎస్ రత్నకుమార్, హెచ్‌వీలు సుభద్రమ్మ, రాధిక, టీబీ సూపర్‌వైజర్ రఫేల్, ఏఎన్ఎంలు రాజమ్మ, తార, ఆదిలక్ష్మి, వెంకటముత్యం, మంగమ్మ, ఝాన్సీరాణి, రీనా, సావిత్రి, అనూష, సుజాత, నాగలక్ష్మి, సుశీల పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు

దమ్మపేట : మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి, కేసు నమోదు చేశారు. మండలంలోని మొద్దులగూడెం గ్రామ శివారులో మంగళవారం పేకాట ఆడుతున్నారనే సమాచారం ఎస్సై సాయికిషోర్‌రెడ్డికి వచ్చింది. దీంతో సిబ్బందితో కలసి శిబిరంపై దాడి చేసి, ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ.2180 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురిపై...

పాల్వంచరూరల్ : అన్నదమ్ముల మధ్య పాతకక్షల కారణంగా సోదరుడిని బూతులు తిట్టి దాడి చేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని పునుకుల గ్రామానికి చెందిన బుర్ర లింగయ్య ఇంటివద్ద ఫోన్ మాట్లాడుతుండగా ఫోన్ ద్వారా వీడియో తీస్తున్నాడని భావించిన లింగయ్య అన్న భద్రయ్య, సాయి, వీరమ్మ సోమవారం గొడవ పడ్డారు. ముగ్గురూ కలిసి తనపై దాడి చేశారని లింగయ్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

13న ఆదివాసీ తెగల సమ్మేళనం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: ఆదివాసీ తెగల ఆరాధ్య దైవాలైన సమ్మక్క సారలమ్మల సన్నిధిలో ఈ నెల 13న సమ్మేళనం నిర్వహించనున్నామని తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య స్పష్టం తెలిపారు. మంగళవారం ఇల్లెందులోని కొమురంభీం, అంబేద్కర్ విగ్రహాల ఎదుట సమ్మేళన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాకతీయులతో పోరాడి అమరులైన ఆదివాసీ వీరవనితలు సమ్మక్క–సారలమ్మలను తాము దేవతలుగా కొలుస్తున్నామని, ఏన్నో ఏళ్లుగా ప్రత్యేక పూజలు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఆదివాసీలు తమ మనుగడ కోసం పోరాడుతున్నారని, పోడు భూములు, హక్కులు సాధన, ఖనిజ సంపద కాపాడుకునేందుకు, నీటి వనరుల కోసం నిరంతర ఉద్యమాలు సాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు వట్టం కన్నయ్య, దనసరి రామ్మూర్తి, దుగ్గారపు వీరభద్రం, ఈసం కృష్ణ, ఈసాల రామచంద్రు, సూర్ణపాక రామారావు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సులో గంజాయి స్వాధీనం

పాల్వంచ : ఆర్టీసీ బస్సులో ఎక్సైజ్ అధికారులు గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన పాల్వంచలో మంగళవారం చోటుచేసుకుంది. ఛత్తీస్‌గఢ్ నుంచి విజయవాడకు బస్సులో గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ సీఐ గురునాథ్ రాథోడ్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. చివరి సీటు కింద 4 కేజీల గంజాయి ప్యాకెట్లు ఉండగా స్వాధీనం చేసుకున్నారు. అయితే గంజాయి ఎవరు తరలిస్తున్నారనేది నిర్ధారణ కాలేదు.

ఇద్దరు విక్రేతల అరెస్ట్

అశ్వాపురం: మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ వద్ద మంగళవారం రాత్రి అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అశ్వాపురం, మణుగూరు పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై షాహీనా

అన్నపురెడ్డిపల్లి : ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. ఈ మేరకు ఎస్సై షాహినా మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని ఎర్రగుంటలో గత నెలలో కిరాణా షాపు వద్ద పార్క్ చేసిన బైక్‌ను కారులో వచ్చిన కొందరు వ్యక్తులు అపహరించేందుకు ప్రయత్నిస్తుండగా నైట్ బీట్ డ్యూటీలో ఉన్న పోలీసులు గమనించి పట్టుకునేందుకు వెంబడించగా వారు కారు వదిలి పారిపోయారు. కాగా, మంగళవారం మండలంలోని మహబూబ్‌నగర్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై ఇద్దరు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా తాము వదిలి వెళ్లిన కారు కోసం వచ్చినట్లు తెలిపారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిని ఏపీలోని పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరుకు చెందిన సయ్యద్ షరీఫ్, మన్నేపల్లి పవన్‌కుమార్‌గా గుర్తించారు. వీరిలో పవన్‌కుమార్ బీటెక్ చదువుతున్నాడని ఎస్సై తెలిపారు. మొత్తం ఐదుగురు సభ్యులు ముఠాగా ఏర్పడి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక చోట్ల చోరీలకు పాల్పడినట్లు ఆమె వివరించారు. సుభాని, వీరయ్య, అష్రఫ్ పరారీలో ఉన్నారని, అరెస్ట్ చేసిన ఇద్దరిని కొత్తగూడెం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరిచామని తెలిపారు.

కారు బ్యాటరీ చోరీపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్ : పట్టణంలోని ఎక్సైజ్ శాఖ పోలీస్‌స్టేషన్‌లో నిలిపి ఉన్న కారు బ్యాటరీ చోరీ గురైనట్లు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ లో ఎక్సైజ్ కానిస్టేబుల్ జమాల్ ఫిర్యాదు చేయగా ఎస్ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిలిపి ఉన్న కారును ఎవరో కదిలించినట్లుగా అనుమానం వచ్చి స్టేషన్‌లో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా, ఒక మహిళ కారులో ఉన్న బ్యాటరీని చోరీ చేసినట్లు గుర్తించారు. అనంతరం అధికారులకు సమాచారం అందించిన కానిస్టేబుల్ ఆధారాలతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దివ్యాంగుడిపై దాడి కేసులో..

దివ్యాంగుడినైన తనను అకారణంగా దుర్భాషలాడి, దాడి చేశాడంటూ భద్రాచలం పట్టణానికి చెందిన బాబు.. రామకృష్ణ అనే వ్యక్తి పై మంగళవారం ఫిర్యాదు చేశాడని ఎస్సై తెలిపారు. ఈ మేరకు రామకృష్ణపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

వేధింపుల ఘటనపై..

వివాహితపై భర్త వేధిస్తుండగా బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయలక్ష్మి తెలిపారు. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన కందుకూరి ఉషకు ఏడేళ్ల క్రితం సాయిరాం అనే వ్యక్తి తో వివాహం జరిగింది. వీరికి ఒక బాబు జన్మించాడు. కాగా, రెండు నెలల నుంచి మద్యం సేవించి తనను అనుమానిస్తూ మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడంటూ ఉష భర్తపై మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సాయిరామ్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఔషధ కంపెనీపై కేసు నమోదు

కొత్తగూడెం రూరల్: కొత్తగూడెం పట్టణంలో ఓ మెడికల్ ఏజెన్సీలో మంగళవారం తనిఖీలు చేపట్టగా అధిక ధరలకు ఓ రకం మందును విక్రయిస్తున్నట్లు ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు జి.ప్రసాద్, జిల్లా ఔషధ తనిఖీ అధికారి సీహెచ్.సంపత్‌కుమార్ గుర్తించారు. గ్రిసియోలాబ్–250 మందును రూ.19 బదులుగా, రూ.65 ముద్రించి విక్రయించారని, దీనిపై లాబోరేట్ ఫార్మాస్యూటికల్స్ ఇండియా లిమిటెడ్ అనే ఔషధ తయారీ కంపెనీపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


పాండురంగాపురంలో చోరీ

పాల్వంచరూరల్ : కిరాణా దుకాణం షెట్టర్ తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని పాండురంగాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ప్రధాన రహదారిపై గల కొత్త కృష్ణ సోమవారం రాత్రి దుకాణానికి తాళంవేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం షాపు తెరిచే క్రమంలో షెట్టర్ల తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా కౌంటర్‌లోని రూ.60 వేల నగదు చోరీకి గురైందని గమనించాడు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.శ్రీనివాస్ తెలిపారు.

మృతదేహం లభ్యం

ములకలపల్లి : రాచన్నపేట శివారులో మృతదేహం లభించడం కలకలం రేపింది. రాచన్నగూడెం జీపీ పరిధిలోని అటవీ ప్రాంతంలో గొల్లంకులగుట్ట వద్ద మృతదేహం ఉన్నట్లు మంగళవారం పశువుల కాపరులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఎస్సై రాజమౌళి ఘటనా ప్రాంతానికి చేరుకొని వివరాలు సేకరించారు. సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో మృతుని కుటుంబీకులు ఘటనాస్థలికి వచ్చారు. మృతదేహాన్ని మండల పరిధిలోని పాగళ్లపల్లికి చెందిన షేక్ హుస్సేన్ (65)గా గుర్తించారు. మతిస్థిమితం సరిగా లేని హుస్సేన్ జనవరి 13 నుండి కనిపించడంలేదని కుటుంసభ్యులు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉంది. పురుగులు పట్టి, దుర్వాసన వస్తోంది. సుమారు వారం రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని పోలీసులు బావిస్తున్నారు. ఘటానాస్థలిలో పోస్టుమార్టం నిర్వహించి, ఖననం చేశారు. మృతుని కొడుకు ఖన్నా సాయిబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పుల్లారావు తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పాల్వంచ : తీవ్ర అనారోగ్యంతో ఉన్న వ్యక్తి స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం బస్టాండ్ కాంప్లెక్స్ వద్ద యాచకుడిగా తిరిగే ఓ వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో పడిపోయి ఉన్నాడు. సమాచారం అందుకున్న సీఐ వినయ్‌కుమార్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి వయసు 35 సంవత్సరాలు ఉంటుందని, బూడిద రంగు ప్యాంట్, బ్లూ కలర్ చిన్నగడల చొక్కా ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని పాల్వంచ పట్టణ పోలీసులు కోరారు.

చికిత్స పొందుతున్న మహిళ..

దమ్మపేట : సహజీవనం చేసే వ్యక్తి, మరొకరితో పెళ్లికి సిద్ధం కావడంతో మూలికల విషం తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన దమ్మపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మహిళ (26)తో అశ్వారావుపేట మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కుప్పాల ప్రసాద్ రెండేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. కాగా, ఇటీవల ప్రసాద్ వేరే యువతితో పెళ్లికి సిద్ధమయ్యాడనే విషయం తెలియడంతో తాను మోసపోయానని గ్రహించిన సీత ఈనెల 1న విషం తాగింది. కుటుంబ సభ్యులు సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

గుండెపోటుతో మల్టీపర్పస్ వర్కర్ మృతి


వెంకన్న (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ చింతల వెంకన్న (44) గుండెపోటుతో మృతిచెందాడు. మంగళవారం మధ్యాహ్నం వరకు పంచాయతీలో పనులు చేసిన వెంకన్న ఇంటికి చేరుకున్నాడు. విశ్రాంతి తీసుకునేందుకు నిద్రించిన ఆయన నిద్రలోనే తుది శ్వాస విడిచాడు. భోజనం కోసం నిద్ర లేపేందుకు యత్నించిన కుటుంబసభ్యులు ఆయన మృతిచెందినట్లు నిర్ధారించుకుని కన్నీరుమున్నీరయ్యారు. వెంకన్న భౌతికకాయంపై పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యువకుడి ఆత్మహత్య

దమ్మపేట: మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన దమ్మపేట అర్బన్ కాలనీ గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన సున్నం మహేష్(30) మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు అందరూ నిద్రిస్తుండగా శివారులోని పామాయిల్ తోటలోకి వెళ్లి మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు చెప్పాడు. దీంతో వారు వెంటనే మహేష్‌ను అశ్వారావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య సున్నం కుమారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.